# అవశేషాల్లేని మిర్చి ఉత్పత్తి

(మొదటి పేజీ తరువాయి)

ఎగుమతి చేస్తున్నారు. ఈక్రమంలో ఇటీవల కాలంలో ఇంటా... బయటా గుంటూరు మిరపపై అపోహలు రావడంతో రైతులకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. దేశం నుంచి ఎగుమతి చేసే మిరప ఉత్పత్తుల్లో 60 శాతం గుంటూరు జిల్లా నుంచి చేస్తున్నారు. అయితే మిరపకు చీడపీడల బెడద పెరగడం, అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో రైతులు విచ్చలవిడిగా పురుగుమందులు చల్లుతున్నారు. దీంతో మిరపకాయల్లో పురుగుమందుల అవశేషాలు ఉన్నట్లు గుర్తించడంతో విదేశీయులు మిరప దిగుమతులపై ఆంక్షలు విధిస్తున్నారు. దీంతో గుంటూరు మిరప ప్రాభవం క్రమంగా తగ్గుతోంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం ఎన్‌పీఎం(నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్) పద్ధతిలో సాగుచేసేలా రైతుల్లో చైతన్యం తీసుకురావడానికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేయడానికి నిధులు మంజూరుచేసింది.

**200 గ్రామాల్లో రైతులకు శిక్షణ :** జిల్లాలో 60వేల హెక్టార్లలో ఏటా మిరప సాగు చేపడుతున్నారు. ప్రధానంగా పల్నాడు ప్రాంతంలో 20మండలాల్లో విస్తారంగా మిరప సాగు చేస్తున్నారు. 20 మండలాల్లో ఒక్కొక్క మండలంలో పదిగ్రామాలు ఎంపిక చేసి మొత్తం 200గ్రామాల్లో రైతులను ఎంపికచేస్తారు. ఒక్కొక్క గ్రామంలో ఒక ఆదర్శరైతును ఎంపికచేసి రైతులందరినీ సమీకరిస్తారు. 200గ్రామాలకు 8మంది క్షేత్ర సలహాదారులు(ఫీల్డ్‌కన్సల్టెంట్లు)ను నియమిస్తారు. క్షేత్రసలహాదారులు, ఉద్యానశాఖ అధికారులకు ఎన్‌పీఎం విధానం, ప్రస్తుతం మిరప సాగులో వస్తున్న నూతన మార్పులపై విశ్రాంత శాస్త్రవేత్త శిక్షణ ఇచ్చి అవగాహన కల్పిస్తారు. వీరు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో రైతులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేసి వారిలో చైతన్యం తీసుకువస్తారు. నవంబరులో ప్రారంభమైన కార్యక్రమం ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగుతుంది. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో జననీ పుడ్స్ సంస్థ క్షేత్రస్థాయిలో పనిచేస్తుంది.

**రైతుల చెంతకు పరిజ్ఞానం :** మిరప సాగును రసాయన రహిత సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తారు. ఏగ్రామంలో ఎంతమంది రైతులు ఎన్ని ఎకరాల్లో మిరప సాగు చేస్తున్నారు. వారు అనుసరిస్తున్న పద్ధతులు ఏవి? ఎంతమంది ఎన్‌పీఎం విధానంలో సాగుచేస్తున్నారు? ప్రస్తుతం వినియోగిస్తున్న పురుగుమందుల వివరాలు క్షేత్రసలహాదారులు సేకరిస్తారు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేసి ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై రైతులను అప్రమత్తం చేస్తారు.